## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 14-11-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- భారత్, ప్రపంచంలోనే 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించనుందని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ రేపు గుజరాత్‌లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు.
- ప్రపంచ ఒప్పందాల ద్వారా భారత్ స్వేచ్ఛా వాణిజ్యాన్ని బలోపేతం చేస్తోందని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ పేర్కొన్నారు.
- బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి భారీ విజయం దిశగా ముందుకు వెళుతోంది.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నంలో 30వ సిఐఐ భాగస్వామ్య సదస్సు 2025ను ఆయన ఈరోజు ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి భారత పరిశ్రమల సమాఖ్య నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ.. భారత్, ప్రపంచంలోనే 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించే దిశగా ముందుకు వెళుతోందని, అంకుర సంస్థల హబ్‌గా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఇ-గవర్నెన్స్ వేగవంతమైన సేవలను అందిస్తూ సాంకేతికత ఆధారిత ఆర్థిక వ్యవస్థను నిర్మించడంలో సహాయపడుతున్నాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్, దేశంలో ఉత్తమ పెట్టుబడి గమ్యస్థానాలలో ఒకటిగా పేర్కొన్న ఆయన.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని వివిధ సంస్థల అధినేతలను ఆహ్వానించారు.

(వాయిస్…33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ రేపు గుజరాత్‌లో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా ఆయన ముంబై-అహ్మదాబాద్ హై-స్పీడ్ రైల్ కారిడార్ పురోగతిని సమీక్షించి, సూరత్‌లో నిర్మాణంలో ఉన్న బుల్లెట్ రైలు స్టేషన్‌ను సందర్శిస్తారు. నర్మదా జిల్లాలోని దేవ్‌మోగ్రా ఆలయాన్ని సందర్శించి, పూజలు నిర్వహిస్తారు. అలాగే.. ధర్తీ ఆబా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి వేడుకల్లో పాల్గొంటారు. ఈ పర్యటనలో భాగంగా 9 వేల 700 కోట్ల రూపాయలకు పైగా విలువైన వివిధ మౌలిక సదుపాయాలు, అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసి అనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం డ్రోన్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, స్పేస్, సెమీకండక్టర్, డిఫెన్స్ కారిడార్లను అభివృద్ధి చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. భారత పరిశ్రమల సమాఖ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి

విశాఖపట్టణంలో ఈరోజు నిర్వహించిన ఈ సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రం సులభంగా వ్యాపారం చేయడం అనే స్థితి నుండి వేగవంతమైన వ్యాపారం చేయడం అనే స్థితికి చేరిందన్నారు. గడచిన 17 నెలల్లో రాష్ట్రం 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులను సాధించిందని, 20 లక్షల ఉద్యోగాలను సృష్టించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పియూష్ గోయల్ మాట్లాడుతూ.. భారత్, ప్రపంచ ఒప్పందాల ద్వారా స్వేచ్ఛా వాణిజ్యాన్ని బలోపేతం చేస్తోందన్నారు. విశాఖ గ్లోబల్ ట్రేడ్ గేట్ వేగా నిలుస్తోందని, స్టీల్ ఉత్పత్తి, ఆక్వా రంగాల్లో ఈ ప్రాంతం ప్రసిద్ధి చెందిందని పేర్కొంటూ...

(వాయిస్…30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

బీహార్‌లోని 243 అసెంబ్లీ స్థానాలకు ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాల్లో నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (NDA) 190కి పైగా స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. బిజెపి 77 స్థానాల్లో విజయం సాధించి, 12 స్థానాల్లో ఆధిక్యంలో ఉండగా.. జనతాదళ్ యు 62 చోట్ల గెలిచి, 23 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. ఆర్జేడీ 18 స్థానాల్లో గెలిచి, 7 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. ఎల్.జె.పి.ఆర్.బి 15 స్థానాలు గెలిచి, 4 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. ఈ నెల 6,11 తేదీల్లో జరిగిన 243 మంది సభ్యుల అసెంబ్లీ ఎన్నికల్లో బీహార్ 67.13 శాతం చారిత్రాత్మక పోలింగ్ ను నమోదు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

బాలల దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు రాష్ట్రపతి భవన్ లోని కల్చరల్ సెంటర్‌లో వివిధ విద్యాసంస్థలకు చెందిన చిన్నారులతో సంభాషించారు. వారితో కొంత సమయం గడిపిన రాష్ట్రపతి.. వారితో పాటు వందేమాతరం గీతం ఆలపించి, కవితలు పఠించారు. పిల్లలే దేశ భవిష్యత్తు అని, వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడం చాలా ఆవశ్యకమని రాష్ట్రపతి ఒక సామాజిక మాధ్యమం పోస్టులో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద న్యూఢిల్లీలోని భారత్ మండపంలో 44వ ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్-ఐఐటిఎఫ్ ను ఈరోజు ప్రారంభించారు. దాదాపు 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, 60 కి పైగా మంత్రిత్వ శాఖలు ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నాయి. అలాగే.. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, చైనా, ఇరాన్, దక్షిణ కొరియా, ఈజిప్ట్ సహా 12 దేశాలు ఈ 14 రోజుల అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనలో పాల్గొంటున్నాయి. ఈ ప్రదర్శన దేశీయ, అంతర్జాతీయ వాణిజ్యానికి ఒక ప్రధాన వేదికగా నిలుస్తూ వ్యాపారానికి, వినియోగదారులకు మధ్య సంబంధాలను బలోపేతం చేస్తుంది. ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్ అనే ఇతివృత్తంతో ఈ సంవత్సరం ప్రదర్శన జరుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా 7 రాష్ట్రాల్లోని 8 నియోజకవర్గాల్లో జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికలలో, బిజెపి, కాంగ్రెస్ చెరో రెండు స్థానాలను గెలుచుకున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ, పిడిపి, మిజో నేషనల్ ఫ్రంట్ ఒక్కో స్థానంలో గెలుపొందగా, జెఎంఎం ఒక స్థానంలో ఆధిక్యంలో ఉంది. ఒడిశాలోని నౌపడాలో బిజెపి అభ్యర్థి జయ్ ధోలాకియా 83 వేలకు పైగా ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. తెలంగాణలోని జుబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్.. బీఆర్ ఎస్ అభ్యర్థి పై 24 వేలకు పైగా ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. జమ్మూ కాశ్మీర్‌లోని నగ్రోటా అసెంబ్లీ స్థానంలో బిజెపి అభ్యర్థి దేవయాని రాణా విజయం సాధించారు. రాజస్థాన్‌లోని అంటా అసెంబ్లీ స్థానాన్ని కాంగ్రెస్ అభ్యర్థి, పంజాబ్‌లోని తర్న్ తరన్ అసెంబ్లీ స్థానాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి హర్మీత్ సింగ్ సంధు గెలుచుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

రక్షణ రంగంలో స్వావలంబన అత్యంత ఆవశ్యకమని రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ అన్నారు. న్యూఢిల్లీలోని యునైటెడ్ సర్వీస్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇండియాలో జరిగిన 3వ ఇండియన్ మిలిటరీ హెరిటేజ్ ఫెస్టివల్ ప్రారంభ సమావేశంలో ఈరోజు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశ సైనిక వారసత్వాన్ని కాపాడుకోవడంతో పాటు రక్షణ రంగంలో సాంకేతిక పురోగతిని బలోపేతం చేయడం కీలకమని వ్యాఖ్యానించారు. భారతదేశ సైన్యం సేవలు, క్రమశిక్షణ, నిబద్ధతలను ప్రశంసించిన ఆయన ఆపరేషన్ సిందూర్

సమయంలో సైన్యం వీరోచిత పోరాటాలను కొనియాడారు. స్వదేశీకరణ, నూతన ఆవిష్కరణలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలను స్వీకరించేందుకు భారత రక్షణ వ్యవస్థ సిద్ధంగా ఉందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

రోజువారీ ఆదాయాన్ని అందించే ఓ పెట్టుబడి పథకాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రోత్సహిస్తున్నారనే విధంగా సామాజిక మాధ్యమంలో వస్తున్న ఓ వీడియో నకిలీదని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో నిజ నిర్ధారణ విభాగం తెలిపింది. ప్రభుత్వం అటువంటి పథకం గురించి ఎటువంటి ప్రకటన చేయలేదని PIB స్పష్టం చేసింది. ఇటువంటి పెట్టుబడి మోసాల పట్ల పౌరులు అప్రమత్తంగా ఉండాలని, అటువంటి వాటిని విశ్వసించవద్దని సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = =

ఈ నెల 16వ తేదీ వరకు తూర్పు రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్ లలోని కొన్ని ప్రాంతాల్లో చలిగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. 16, 18 తేదీల్లో కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాం.. 17, 19 తేదీల్లో రాయలసీమలోను.. 18, 19 తేదీల్లో అండమాన్ నికోబార్ ద్వీపంలోను కొన్ని చోట్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్త ఉమాశంకర్ దాస్ పేర్కొంటూ...

(వాయిస్…20 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

సులభతర వాణిజ్యంలో జమ్ము కశ్మీర్ అగ్రస్థానంలో నిలిచింది. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఉద్యోగ్ సమాగం 2025లో జమ్మూ కాశ్మీర్ పరిశ్రమలు, వాణిజ్య శాఖ కమిషనర్ కార్యదర్శి విక్రమ్‌జిత్ సింగ్.. ఈ అవార్డును కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్ చేతుల మీదుగా స్వీకరించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = =